క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

సంతకవిటి: రాజాం–సంతకవిటి ప్రధాన రహదారిలో బిల్లాణి జంక్షన్ నుంచి తలతంపరకు తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం భూమి పూజ చేశారు. రూ.1.05 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామని, త్వరితగతిన నిర్మాణ పనులు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బొద్దూరు ఎంపీటీసీ సభ్యుడు వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి


గుళ్లపాడులో సేకరించిన మట్టి నమూనాలు

రేగిడి: రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో పలువురు రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను వ్యవసాయ సిబ్బంది ఆదివారం సేకరించారు. ఈసందర్భంగా ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి నమూనాలను ల్యాబ్‌లకు తరలించి పరీక్షలు చేస్తామని చెప్పారు. పరీక్షల్లో వచ్చే ఫలితాల ఆధారంగా ఆయా భూముల్లో ఏయే పంటలు పండిస్తే మంచి దిగుబడులు వస్తాయి, ఏ పంటలకు ఆ నేలలు అనుకూలం కాదో అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ధ్యానంతో ఆరోగ్యం


ధ్యానం, యోగా ప్రాముఖ్యతను వివరిస్తున్న న్యాయవాది వేణుగోపాలనాయుడు

రేగిడి: ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని, ఆరోగ్యంగా ఉండవచ్చని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఆదివారం ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. రోజూ ధ్యానం, యోగా చేయడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వేణు గోపాల నాయుడు వివరించారు.ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. పలువురు వక్తలు నైతిక వికాసంపై వివరించారు. సత్యసాయి భజనమండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు కావాలి


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సంద ర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం ఎంతో మంచి అలవాటని అన్నారు. పుస్తకపఠనంతో ఏకాగ్రత, సృజనాత్మకత పెరుగుతుందని చెప్పా రు. శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించి, కథలు, నవలలు, ఇతిహాసాలు అన్ని రకాల పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులంతా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్లు మరమ్మతులు


బొద్దాంలో బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

రాజాం: మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, గురవాం తదితర గ్రామాల్లోని పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు ఆదివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయని బోర్లు బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు.

- ప్రజలపై వంటగ్యాస్ ధరల బాదుడు
- ఒక్కో సిలిండర్‌పై రూ.50లు పెంపు
- నియోజకవర్గంలో 96 వేల గ్యాస్ కనెక్షన్లు
- నెలకు 1.30 లక్షల గ్యాస్‌బండల వినియోగం
- వినియోగదారులపై రూ.65 లక్షల అదనపు భారం

జనం నెత్తిన.. గుదిబండ!



పెరిగిన ధరతో ఒక్కో గ్యాస్ రూ.877

రాజాం: సామాన్యుల పాలిట గుదిబండలా గ్యాస్ బండ మారింది. ఒక్కో వంటగ్యాస్ సిలిండర్ కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం మరో రూ.50లు పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతుంటే తాజాగా గ్యాస్ ధరల పెంపు తమను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు మైదాన ప్రాంతాల్లోనూ ఇటు గిరిజన ప్రాంతాల్లోనూ ప్రస్తుతం గ్యాస్ వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు గ్యాస్‌భారం తప్పక మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు స్వల్పంగా గ్యాస్ ధరలు తగ్గించిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచేయడంతో అప్పుడు అవసరం కోసం తగ్గించి, ఇప్పుడు అవసరం తీరాక పెంచేశారని అంతా విమర్శిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లే ఇస్తామని మాట మార్చింది. దీనికి తోడు గడెనెక్కిన ఏడాది కేవలం ఒకటే ఒక సిలిండర్ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. అంతేకాకుండా డబ్బులిచ్చి గ్యాస్‌బండ తీసుకుంటున్న వారిలో ఎవరికి ప్రభుత్వం డబ్బులు వేస్తుందో.. ఎవరికి వేయడం లేదో అంతా అయోమయంగా ఉంది. కేంద్రంలోని మోదీ సర్కారు.. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం.. ప్రజలను మోసగించడానికే ఉన్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఒక గ్యాస్‌బండ ధర రూ.827 ఉండగా, ప్రస్తుతం పెరిగిన ధరతో కలిపి గ్యాస్ ధర రూ.877 అయింది. రాజాం నియోజకవర్గంలోని రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లో 96 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉండగా, నెలకు సగటున 1.30 లక్షల గ్యాస్‌బండల వినియోగం జరుగుతోంది. తాజాగా జరిగిన రూ.50 పెంపుతో నియోజకవర్గంలోని గ్యాస్ వినియోగదారులపై మొత్తం రూ.65 లక్షల మేర అదనపు భారం పడుతోంది. ధరల పెంపును రాష్ట్ర ప్రభుత్వం కూడా అదుపు చేయకపోవడంతో తప్పనిసరిగా ఆ అదనపు భారం మోయాల్సిన దుస్థితి నెలకొంది.

ఆన్‌లైన్ బుకింగ్‌తో అవస్థలు..

గతంలో గ్యాస్ విడిపించుకోవాలనుకునే లబ్ధిదారులు నేరుగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు చేరుకుని తమ వద్ద ఉన్న గ్యాస్ పుస్తకాల ఆధారంగా డబ్బులు చెల్లిస్తే గ్యాస్ బండలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే గ్యాస్ బండలు విడిపించుకోవాల్సి వస్తోంది. ఈ విధానం చాలా మందికి తెలియకపోవడం, చాలామంది వినియోగదారుల వద్ద ఫోన్లు లేకపోవడంతో గ్యాస్‌ను సకాలంలో పొందలేకపోతున్నారు. ఇంకోవైపు ఈకేవైసీ చేసిన గ్యాస్ ఏజెన్సీలు తప్పుల తడకలతో ఒకరి ఫోన్ నంబర్ ఇంకొకరికి అనుసంధానం చేయడంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ధరల భారం మోయలేం..

గ్యాస్ ధరల భారం ఇక మోయలేం. ప్రతిసారి పెంచేస్తున్నారు. గతంలో కట్టెల పొయ్యిలు వాడేవాళ్లం. అప్పట్లో అది మంచిది కాదు.. గ్యాస్ వినియోగించాలని తక్కువ ధరకు గ్యాస్, సిలిండర్ ఇచ్చి ప్రోత్సహించారు. ఇప్పుడు గ్యాస్ అలవాటు అయిన తర్వాత ధరలు పెంచేస్తున్నారు. ఇలా అయితే కష్టమే..

–కె.రాజులమ్మ, గృహిణి, వంగర

ప్రభుత్వమే ధరలు నియంత్రించాలి..

ప్రభుత్వమే గ్యాస్‌బండల ధరలు నియంత్రించాలి. ఇలా ఆరు నెలలకు, ఏడాదికి రూ.50లు చొప్పున పెంచుకుంటూ పోతే ఇబ్బందులు తప్పవు. నెలకు మాకు రెండు బండలు అవసరం అవుతున్నాయి. రూ.100లు అదనపు భారం మోయాల్సి వస్తోంది.

ఎం.వరలక్ష్మి, గృహిణి, వస్త్రపురికాలనీ, రాజాం

ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి జన్మదిన వేడుకలు


మాజీ ఎమ్మెల్యే శంబంగికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా తనపై ఇంత అభిమానం చూపిస్తున్న పార్టీ శ్రేణులకు, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలని మాజీ ఎమ్మెల్యే శంబంగి తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విశాఖలో మేయరు పదవి దక్కించుకునేందుకు కూటమి నాయకులు చేసిన దుశ్చర్యను ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. పీఎంసీ(పేరెంట్స్ మానటరింగ్ కమిటీ) ఎన్నికల దగ్గర నుంచి స్థానిక సంస్థల్లో పదవుల దగ్గర వరకు ఆ పార్టీ బలం లేనిచోట అవతలి పార్టీ నాయకులను లాక్కుని మరీ అధికారం చేజిక్కించుకోవాలన్న దురాశ కూటమి నాయకుల్లో ఉందన్నారు. దీనికి తార్కాణంగా గతంలో జరిగిన పాఠశాలల్లో జరిగిన పీఎంసీ ఎన్నికలు, ఇప్పుడు అప్రజాస్వామికంగా దక్కించుకున్న విశాఖ కార్పొరేషన్ మేయర్ పీఠం..లే నిలుస్తున్నాయన్నారు. బొబ్బిలిలో కూడా రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత రాజకీయాల అర్థమే మారిపోయిందన్నారు. స్వప్రయోజనాలు, డబ్బు చుట్టే రాజకీయాలు ఉంటున్నాయన్నారు. ప్రజలు ఇలాంటి స్వార్థపూరిత రాజకీయ నాయకుల పాలనకు స్వస్తి పలకాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి వయో పరిమితి పెంచాలి

రాజాం: డీఎస్సీకి సంబంధించి, నిరుద్యోగుల వయో పరిమితి పెంచాలని నిరుద్యోగుల యూనియన్ ప్రతినిధి గొర్లె నారాయణరావు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. గత ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేదని, ఇప్పుడు వచ్చిందంటే అప్పటి నుంచి వేచి చూసిన అభ్యర్థుల వయసు ప్రస్తుత డీఎస్సీ వయో పరిమితి దాటిందన్నారు. దీంతో చాలామంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వయో పరిమితి పెంపుపై ఆలోచన చేయాలన్నారు.

క్రీస్తు పునరుత్థానం.. సర్వమానవాళికి శుభదినం!


రాజాం ఆర్సీఎం చర్చిలో ఈస్టర్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ దంపతులు, తదితరులు


వంగర: కింజంగిలో ఈస్టర్ పర్వదినాన క్రీస్తు పునరుత్థానాన్ని తెలియజేస్తూ క్రైస్తవుల ర్యాలీ


బొబ్బిలిలో చర్చిలో దివ్యబలి పూజలో పాల్గొన్న మతవిశ్వాసులు


తెర్లాంలోని ఆర్సీఎం చర్చిలో కొవ్వొత్తులతో క్రైస్తవుల ఆరాధన

వాడవాడలా ఈస్టర్(క్రీస్తు పునరుత్థాన పండగ) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపాల నుంచి సర్వమానవాళిని రక్షించేందుకు శిలువపై ప్రాణత్యాగం చేసుకున్న ఏసు ప్రభువు..చనిపోయిన తర్వాత మూడో రోజు సజీవుడై సమాధి నుంచి లేచి వస్తారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని, శనివారం రాత్రి నుంచే క్రైస్తవులంతా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు చేశారు. క్రీస్తు రాకను స్వాగతిస్తూ గీతాలాపనలు చేశారు. క్రీస్తు పునరుత్థానం ప్రజలందరికీ శుభదినమని, జీసస్ చూపిన ప్రేమ, శాంతి మార్గాలను అనుసరించాలని ఫాదర్‌లు, పాస్టర్‌లు కోరారు.


–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

మద్యం తాగి వాహనం నడిపితే క్రిమినల్ కేసు


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వంగర: మద్యం సేవించి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఆదివారం నిర్వహించారు. అటువైపుగా వెళ్తున్న వాహనదారులను ఆపి, వారు మద్యం తాగినదీ.. లేనిదీ.. బ్రీత్‌ఎనలైజర్ సాయంతో పరీక్షించారు. అనంతరం మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. చాలామంది మద్యం మత్తులోనే ప్రమాదాలకు గురై, తమ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

వితరణ


విద్యార్థులకు దుస్తులు, ఆటవస్తువులు, పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: మండలంలోని బట్టివలస గ్రామంలో గిరిజన విద్యార్థులు, చిన్నారులకు అలజంగి ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణదాసు, నారసింహునిపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు నాగూరు రమేష్ తమ సొంత నిధులతో దుస్తులు, పుస్తకాలు, క్రీడా సామగ్రిని ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యా యులు మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో ఇంటి వద్దే ఉంటూ చదువుకునేందుకు, ఆడుకునేందుకు పుస్తకా లు, ఆటవస్తువులు సమకూర్చామని చెప్పారు. చిన్నారులకు ఆహార పదార్థాలు అందించారు. దాతలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


నవధాన్యాల విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ పద్మ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని చెప్పారు. వేసవిలో నవధాన్యాలు సాగుచేసి వాటిని కలియదున్నడం వల్ల ఖరీఫ్‌లో వేసే పంటకు సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా అందుతాయని అన్నారు. రైతులు అంతా ఈ విధానాన్ని అవలంబించాలని సూచించారు. అనంతరం నవధాన్యాల విత్తనగుళికలను రైతులతో తయారీ చేయించారు. వీటిని పొలాల్లో చల్లితే వర్షం వచ్చినప్పుడు మొలకెత్తుతాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ సురేష్, ఐసీఆర్‌పీలు వరలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైనా.. పట్టించుకోరా..?


రేగిడి మండలం, సంకిలి గ్రామం దగ్గరున్న సాయన్నచానల్ ప్రధాన కాలువ రెగ్యులేటర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో బాధిత రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులేటర్లు అధ్వానంగా ఉండడంతో దిగువ ప్రాంతాల్లోని పొలాలకు సాగునీరు సరిగా అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. వేసవిలో నీరు తక్కువగా ఉన్నప్పుడే వీటిని బాగు చేసి వచ్చే ఖరీఫ్ సాగుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రేగిడి

మట్టి కుండలు.. ఆరోగ్య పాత్రలు..!


పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టి కుండలో ఆహారం వండుకున్నా.. నీరు నిల్వ ఉంచుకున్నా అది ఆరోగ్యానికి మంచిదేనని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో చల్లని నీరు తాగేందుకు అందరూ ఇష్టపడుతుంటారు. అయితే ఫ్రిజ్‌లోని నీరు తాగడం కన్నా కుండలోని నీరు తాగితే సహజ లవణాలు**, ఎలక్ట్రోలైట్లు శరీరానికి అందుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి** దాహార్తి తీర్చేందుకు ఎక్కడికక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేసి, కుండల్లో నీరు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ నేపథ్యంలో అందరి కళ్లు మట్టికుండలపై పడింది. దీంతో మార్కెట్‌లో కుండలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ ఫొటోలో కనిపిస్తోంది..రామభద్రపురంలోని సాలూరు రూట్‌లో మట్టికుండల విక్రయాలు.

–రామభద్రపురం

ఆశాజనకంగా రబీ సాగు..!


ఈ ఏడాది రబీ సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. ముఖ్యంగా వంగర మండలంలోని కొప్పర, కొండచాకరాపల్లి గ్రామాల రైతులు తాము పండిస్తున్న వరి పంటపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఆయా గ్రామాల్లో 100 ఎకరాలకు పైగా 1010 రకం వరి సాగు చేస్తుండగా, ప్రస్తుతం పంట ఏపుగా పెరిగింది. తెగుళ్ల బెడద లేకుండా ఉంటే లాభాలు బాగా వస్తాయని రైతులంతా ఆశిస్తున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తోంది..కొండచాకరాపల్లి గ్రామంలోని వరి సాగు.

–వంగర

బీసీలకు రాజ్యాధికారం దూరం చేసే కుట్ర


మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేగిడి: బీసీలకు రాజ్యాధికారాన్ని దూరం చేసే కుట్రకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. విశాఖ నగర కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న బీసీ మహిళను కూటమి ప్రభుత్వం అక్రమంగా అధికార దుర్వినియోగానికి పాల్పడి పదవి నుంచి దించేశారన్నారు. విశాఖ కార్పొరేషన్‌లో 100 మంది కార్పొరేటర్లకు గాను 24 మంది కార్పొరేటర్లు యాదవ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. వారందరినీ రాజ్యాధికారానికి దగ్గర చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ సామాజిక వర్గానికి మేయర్ పదవి కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలను రాజ్యాధికారం దక్కనివ్వకుండా ఉండాలన్న కుతంత్రం పన్నుతోందని మండిపడ్డారు. ఇది బీసీలపై జరిగే రాజకీయ దాడిగానే భావిస్తున్నామన్నారు. కూటమి పార్టీలు సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. ఒక బీసీ మహిళ మేయర్ సీటుపై కూర్చోవడం కూటమి పార్టీలు తట్టుకోలేకే పీఠం నుంచి దించివేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఒకటైన విశాఖపట్నం మేయర్‌ను పదవి నుంచి దూరం చేసిన కూటమి పార్టీల కుట్రను బీసీలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు. కూటమికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అదే సామాజిక వర్గం వారిని మేయర్ సీటుపై కూర్చోబెట్టాలన్నారు. ఆయన వెంట కింజరాపు సురేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


మాట్లాడుతున్న ఫైర్ ఎస్‌ఐ జనార్దనరావు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫైర్ ఎస్‌ఐ టీఎస్ఎస్ జనార్దనరావు కాసేపు మాట్లాడారు. ప్రమాదాలు, అనుకోని సంఘటనలు జరిగే సమయంలో ప్రజల సహకారం సిబ్బందికి ఎంతో అవసరమన్నారు. అన్ని వేళల అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రమాద నివారణకు సహకరిస్తున్న సిబ్బందిని అభినందించారు. వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ చేసిన కార్యక్రమాలు బాగున్నాయన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ప్రమాదాల సమయంలో ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫైర్ ఏఎస్‌ఐ వై.గోవింద్, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.